# బెదిరిన మనసులు

సీరియల్ నవల

(గత సంచిక తరువాయి)

(2)

"ఏమేవ్, సోమిదేవి ఉత్తరం రాసింది!" అన్నాడు సీతప్ప ఆదరాబాదరా దొడ్లోకి వస్తూ.

"అమ్మాయి ఉత్తరం రాసిందా? అల్లుడూ వాళ్ళంతా కులాసాయేగదా? వాళ్ళ పార్వతికి కనే రోజులు గామోసు, ఆ భోగట్టా ఏమైనా రాసిందా? చిత్తుగాడు బాగా అల్లరి చేస్తూంటాడు!" అన్నది రావమ్మ.

టి. వి. శంకరమ్

"నువు తొందరపడకు! మరేం ఫరవా లేదు!" అన్నాడు సీతప్ప తత్తర బిత్తరగా.

రావమ్మ గుండెల్లో రైళ్లు పరిగెత్త సాగాయి.

సోమిదేవమ్మ సీతప్పగారి కుమార్తె. సత్యం కన్న ఏడెనిమిదేళ్లు పెద్దది. ఆవిడ పెళ్ళి సత్యానికి జ్ఞాపకంలేదు. ఆవిడ భర్త భద్రాచలం పదేళ్ళ క్రితం రెండో పెళ్ళాన్ని చేసుకున్నాడు. పార్వతి ఆవిడే. ఈ పెళ్ళి చాలా రహస్యంగా జరిగింది. సోమిదేవమ్మ దీక్షితుల్ను కడుపుతోఉండి పుట్టింటికి వచ్చేసింది. ఆ సందున పెళ్ళి కాస్తా అయిపోయింది.

పెళ్ళి కాగానే ఆ విషయం వార్త వచ్చింది. సోమిదేవమ్మ శోకాలు పెట్టింది.

"ఊరుకోవే, తల్లీ! బాలింతరాలవు. శుభమాని - కంట తడిపెట్టరాదు. ఎన్ని జరిగేది, ఏమి జరిగేది, ఆడది మొగుణ్ణి నమ్ముకునుండవలసిందేనూ! అంతగా అయితే, అతను నిన్ను ఏలకపోయినప్పటి మాటగద?" అన్నది తల్లి.

"మీరేం కంగారు పడికండి! ఇది నిజమో, ఉత్తుత్తి పుకారో మొదట తెలనివ్వండి! ఏం భయంలేదు, నే చెప్పాగా!" అంటూ సీతప్ప వాణికిపోయాడు.

భద్రాచలం రెండోపెళ్ళి గాలికబురన్నది అబద్ధమయింది. అతను మామగారికి ఉత్తరం రాశాడు. కొన్ని పరిస్థితుల్లో తాను రెండోపెళ్ళి చేసుకోవలిసివచ్చిందనే, సోమిదేవమ్మను విచారించవద్దని చెప్పమనీ అతను ఆ ఉత్తరంలో తెలిపాడు.

పార్వతి సోమిదేవమ్మ కన్న ఆట్టే చిన్నదికాదు. ఆ పిల్లతండ్రి రజస్వలానంతర వివాహానికి సిద్ధపడ్డాడు. పార్వతికి పెళ్ళి కుదిరేలోపునే ప్రేమ కుదిరింది.

భద్రాచలం జీవితంలో కోరికలు కలవాడు. ప్రతి చిన్నసుఖాన్నీ కష్టించి సాధించి అనుభవించాలనే దృష్టికలవాడు. అట్లాగే జీవిస్తూ వచ్చాడు. కాని అతనిభార్య సోమిదేవమ్మ అతని సిద్ధాంతాలకన్నిటికీ గొడ్డలి పెట్టుగా దాపరించింది. ఆవిడ పుట్టింటినుంచి వెంటబెట్టుకు వచ్చిన మాటతీరూ, సాంమిక దృక్పథమూ అతనికి భయం పుట్టించాయి. మనుషులంతా "వాడి" చేతిలో కీలుబొమ్మలయినట్టూ, జీవితంలో ప్రతిదీ కష్టమే, బాధే అయినట్టూ, మనం చేసేది ఏమీలేనట్టూ సోమిదేవమ్మ మాట్లాడుతుంది. చచ్చినా పోట్లాడదు. కాస్తపాటి సంఘర్షణపడవలిసొచ్చినా తల వొంచేస్తుంది. పోనీ, గొప్పసహనంగల మనిషా అనుకుంటే, ఇంట్లో ఆవాలుఅయిపోయినా సరే, 'రాసి

పెట్టుంటే అలాగే అవుతుంది! తప్పుతుందా?'' అనేది. చంద్రమతీదేవికి వచ్చిన కష్టాల్లాటి వాటిని చంద్రమతికన్న ఎక్కువ సహనంతో ఎదుర్కొంటున్న దాని వైఖరి అవలంబించేది.

''ఇది మనిషికాదు! నేను శవంతో కాపురం చేస్తున్నాను!'' అని భద్రాచలం ఎన్నోసార్లు అనుకున్నాడు.

చవి చచ్చి ఉన్నవాడికి మాగాయిటెంక దొరికినట్టుగా భద్రాచలానికి పార్వతి తటస్థ పడింది. అతనిలాగే పార్వతికికూడా జీవితం మీదా, సుఖంమీదా వల్లమాలిన ఆశ ఉన్నది. అతి స్వల్ప సుఖాలను కూడా అసాంతం ఆనందించగల మనిషి. సోమిదేవమ్మను శవంతో పోలిస్తే పార్వతిని బాంబుతో పోల్చాలి. ఆమె భద్రాచలం జీవితంలో ఎంత చైతన్యం తీసుకు వచ్చిందో అతనికి ఒక్కడికే తెలుసు. వాళ్లిద్దరికీ పెళ్లి సీతప్ప అనుకున్నంత రహస్యంగా జరగలేదు. పార్వతికి నెల తప్పిందని తెలియగానే భద్రాచలం పట్లీగ్గా పెళ్ళాడేశాడు. ఆ సమయానికి సోమిదేవమ్మ పుట్టింట ఉండటం కాకతాళీయంగా జరిగింది.

తన అల్లుడి రెండోపెళ్ళి సమస్యకు సీతప్ప సులువైన పరిష్కారం చెప్పేశాడు.

''జరిగింది జరగకుండా చెయ్యలేంగదా? ప్రపంచంలో ఇద్దరేసి భార్యలను చేసుకున్న వారెంతమంది లేరూ? ఇదుగో, అమ్మాయ్, నువ్వయినా సామాన్యమైనదానివి కావు— పిల్లడి తల్లివి. నీకుండే హెూదాను ఎవ్వరూ కాదనలేరూ! ఆపిల్ల దారిన ఆపిల్ల ఉంటుందీ! నీదారిన నువుండూ! ఆపైన భగవంతుడుండనే ఉన్నాడు! అందుచేత మనం విచారించవలిసిన పనిలేదు. విచారించి ప్రయోజనమూ లేదు! ఏవీ జరగనట్టు మాట్లాడక పడుండండి! నరజన్మ ఎత్తింది పడుండటానిక్కాదేమిటి? అబ్బో, మన బాబుల్లాటి వారు పడ్డారు కష్టాలు! మనవోలెఖ్ఖా, జమా! ఏమిటో!''

అంతే, అది మొదలు ఇంటిల్లిపాదీ పార్వతి మీద భద్రాచలానికి కూడా లేని ఆపేక్ష నటించారు. ఇది 'పోజు' కాదు. ఎవరూ లేనప్పుడు కూడా, తమలోతాము మాట్లాడుకునేప్పుడు కూడా, పార్వతిని గురించి ఎక్కడలేని ఆప్యాయతా తెచ్చి పెట్టుకుని మాట్లాడేవారు.

సోమిదేవమ్మనూ, ''చిట్టి'' గాణ్ణీ భద్రాచలం తీసుకువెళ్ళిన కొద్ది రోజులకే సీతప్పతో ఎవరో పెద్దమనిషి, ''హయ్యో, ఎంతపని జరిగిపోయిందండీ. మొదట నేను నమ్మలేక పోయినానుసుమండీ! మీ అమ్మాయిగతి, పాపం ఏమయేట్టు?'' అని అడిగాడు.

''అనుకోగూడదులెండి. అంతా అలా జరిగి వెళుతుంది! వెనక జన్మలో ఏం చేసుకున్నామో మనకైతే తెలీదుగదా, ఇహ ఈ జన్మలోనైనా ఉండవలిసిన తీరుగా ఉంటే ముందు జన్మకింత కద్దు, లేకపోతే లేదు. అన్నింటికీ సాక్షీభూతుడు 'వాడు' ఉంటూండగా మధ్యని మనం ఒకరు తప్పచేశారనిగాని ఒప్పచేశారనిగాని తీర్పు చెప్పడమెందుకు? పిల్ల భర్త దగ్గిరకి వెళ్ళిపోయింది. అది ఒక్కటే చెప్పేసింది: 'నాన్నా, ఆయన ఏంచేసినాసరే, నేను ఆయన దగ్గిర ఉండవలిసినదాన్నితప్ప విడిచి మరోటి అనుకోనుకూడా రాదు! అందుచేత నన పంపెయ్యండి!' అన్నది. బరువు మోసేదిఅదీ!'' అన్నాడు సీతప్ప.

అవతలి పెద్దమనిషి ముక్కుమీద వేలేసుకుని, ''అయితే నిన్నూ, మీ పిల్లది అంతమాట అన్నదిటండీ! కలియుగం అంటామేగాని, ఇది కలియుగంటండీ? కలియుగంలో ఇటువంటి వాళ్లెక్కడుంటారండీ? ఇదే ఇంకోరైతేనండీ, హాత్తెరీ, ఇంకో పెళ్ళి చేసుకుంటాడా అవటా అని అపళంగా కోర్టుకీడ్చి పారేయ్యరుటండీ?'' అన్నాడు ఉద్రేకంతో.

''ఎందుకు చెబుతారులెండి? మా సోమిదేవి అనలీయుగంలో పుట్టవలిసిన మనిషే కాదు! దానికి మరి జన్మ ఉండదు. నాకు తెలుసు,'' అనేశాడు సీతప్ప, పూర్తి విశ్వాసంతో

''సోమిదేవి''కి భవిష్యత్తులో జన్మరాహిత్యము సంగతి ఏమైనా, వర్తమానంలో ఒక మగనలుసుండటం లీగల్‌గా మంచి బలమైన పాయింటని సీతప్ప ఎరుగును. కీడెంచి మేలెంచే సంప్రదాయంలో పార్వతికూడా ఒక మగనలుసును కంటుందనే అనుకున్నాడు.

కాని అయిదో నెలలో పార్వతికి గర్భస్రావమయింది. అదిలగాయతు చాలా కాలం ఆవిడకి గర్భ చిహ్నాలే లేవు.

పార్వతికి గర్భంపోయిందని వార్త వచ్చినప్పుడు సీతప్పా, రావమ్మా చాలా విచారం వెలిబుచ్చారు.

"గర్భం పోవటమంటే మాటలా? అందులో అయిదో నెలని!" అన్నాడు సీతప్ప.

"కాదుటండీ?" అన్నది భార్య, తన భర్త కనిపెట్టిన గొప్ప సత్యాన్ని ఆవిడ ఇట్టే గ్రహించేసిన దానిలాగా!

"కాకరపాదు లాంటిది మేక తినేస్తే మనకు ప్రాణం చివుక్కుమంటుందే!" అన్నాడు సీతప్ప నిట్టూరుస్తూ.

"కాదుటండీ?" అన్నది భార్య మళ్లా.

"పోనీ ఒక్కసారి అక్కాయిని చూసొస్తావేట్రా?" అన్నాడు సీతప్ప కొడుకుతో—గర్భం పోయింది తన కూతురికేనన్నట్టు.

"నాకూ అదే అనిపించింది, నాన్నా!" అన్నాడు సత్యం.

"పోనీ, మరి కొన్నాళ్ళకి పోదుగానివిలే!" అన్నాడు సీతప్ప.

"ఇప్పుడే వెళ్ళటం ఏమంత బాగుండదు లెస్తురూ!" అన్నది రావమ్మ.

పై సంభాషణలో ఆఖరిభాగం పార్వతి గర్భస్రావానికి ఎంతమాత్రం సంబంధించినది కాదు. సోమిదేవమ్మ భర్తదగ్గరికి వెళ్ళాక పరిస్థితి ఎట్లాఉన్నదీ తెలియరాలేదు. పార్వతిగర్భస్రావం గురించి ఉత్తరంరాస్తూ ఆవిడ తనస్థితి ఎట్లాఉన్నదీ తెలపలేదు.

కాని నిజానికి సోమిదేవమ్మ స్థితిలో మార్పేమీలేదు. ఆవిడ వెళ్ళేటప్పటికి పార్వతి అక్కడలేదు. పుట్టింటనే ఉన్నదని తెలిసింది. అందువల్ల సోమిదేవమ్మకు కలిగిన లాభంగాని నష్టంగాని ఏమీలేదు. ఎందుకంటే పార్వతిని ఆవిడ అదివరకే ఎరుగును. రెండు మూడు సార్లు పార్వతి వాళ్ళయింటికి వచ్చింది, తనతో ముచ్చి మూడుమాటలు మాట్లాడింది. వాళ్ళిద్దరికీ విహితమూలేదు, విరోధమూలేదు. ముందు కూడా అట్లాగే ఉండబోతుంది.

భద్రాచలం భార్యతో చాలా మితంగా మాట్లాడేవాడు. ఇప్పుడూ అట్లాగే ఉన్నాడు. పిల్లవాణ్ణి గురించికూడా అట్టే పట్టిచ్చుకోలేదు. ఇంకోపెళ్లాన్ని చేసుకున్నందుకు తానుక్షమించినట్టు అతనికి తెలియగలందులకుగాను సోమిదేవమ్మ "పిల్లణ్ణి సరిగా చూసినట్టయినాలేరు! చూడండి!" అని వెళ్ళినరోజే చూపించబోయింది.

"చూశాను! పసిగుడ్డును చూడటానికేముంది?" అన్నాడు భర్త.

సోమిదేవమ్మ వచ్చిన మర్నాడు సాయంకాలం పార్వతి చుట్టపుచూపుగా వచ్చింది.

"ఏమండీ, పార్వతిగారూ? మీరుకూడా యిప్పుడు మాలో ఒకరయారు," అన్నది సోమిదేవమ్మ.

పార్వతి నిర్ఘాంతపోయి "అవును!" అన్నది.

"ఇదుగో. పిల్లాడు. చేతికివ్వనా?" అన్నది సోమిదేవమ్మ.

పార్వతి భద్రాచలంకేసి ఒక్కసారి చూసి పిల్లాణ్ణి అందుకున్నది.

"మెడకింద చెయ్యి! భద్రం!" అన్నది సోమిదేవమ్మ.

పార్వతి పిల్లాడికేసి వింతగాచూస్తూ ఇంగ్లీషులో ఏదో అన్నది. భద్రాచలం ఇంగ్లీషులోనే ఏదో జవాబిచ్చాడు. ఇద్దరిమాటలూ సోమిదేవమ్మకు అర్థంకాలేదు. తరవాత పార్వతి పిల్లాణ్ణి తిరిగి యిచ్చేసింది. వాళ్ళిద్దరూ బయటికి వెళ్ళిపోయారు.

"ఏం మనిషి!" అన్నది పార్వతి భద్రాచలంతో.

"నీకు ఆశ్చర్యంగా ఉందా?" అన్నాడు భద్రాచలం.

"ఆశ్చర్యంకాదు, గాభరాగా ఉంది! షాకింగ్! కొంచెమైనా ఫీలింగ్స్ ఉన్నట్టు కనబడదేం?"

"ఉంటేగద కనబడటానికి?"

"మేమిద్దరం ఒకచోట ఎట్లావుంటామో నాకర్థం కావడంలేదు. ఎట్లా కాపరం చేశారండీ, అటువంటి—అటువంటి—"

"జీవచ్ఛవంతో!" అని భద్రాచలం పూర్తిచేశాడు.

"ఒక విధంగా జాలిపడవలసిన మనిషి!" అన్నది పార్వతి, చూస్తూ చూస్తూ క్రూరంగా ఉండలేని దానిలాగా.

"ఆ గోతిలో నువుకూడా పడకు! ఎందు కంటే నేను పడ్డాను! అమాయకురాలనీ, తప్పడు వేదాంతం వంటబట్టి అట్లా అయిపో యిందనీ అనుకున్నాను. జీవితంమీద ఆశ పుట్టిద్దామని చాలా ప్రయత్నించాను. చివ రకు వోడిపోయాను. నీ జాలీ, నా జాలీ ఆమని షికి అక్కర్లేదు. ఆ మనిషిలో లోపం జీవితం మీద తగినంత ఆశ లేకపోవటంకాదు, జీవించ టానికి చేసేప్రయత్నాలన్నిటిమీదా విముఖత! నువ్వేవరు? నీ మనస్సు ఏమిటి? అది ఎట్లా పనిచేస్తుంది? ఏమంటే, ఏంచేస్తే అది ముడు చుకుపోతుంది? ఏమంటే వికసిస్తుంది? అవేమీ ఆ మనిషికి అఖ్కర్లేదు. ఈ క్షణాన మన మంతా శాపంతగిలి రాళ్ళయిపోతే ఆ మనిషి జీవితానికి ఏమీ మార్పుండదు. మనల్ని అది వరకే రాళ్లకింద కట్టేసింది! మనం పెళ్ళిచేసు కున్నామని తెలిసి వీసంకూడా చలించని మని షిని ఇంకొకతెను నువ్వూహించగలవా?"

ఆవేశంతో అంతదూరం మాట్లాడేసినాక భద్రాచలానికి బాధకలిగినట్టయింది. పైకి అన నిది అతని మనసులో ఇంకా చాలావుంది. అని ప్రయోజనంలేదు.

కాని పార్వతిమటుకు ఎట్లాగైనా తన సవ తిలో ఏదైనా మంచి చూడటానికి కంకణం కట్టుకున్న దానిలాగా, "ఆవిడ తన మనసులో బాధపడుతున్నదేమో! దాన్ని దాచుకుంటున్న దేమో, ఎట్లా చెప్పగలం?" అన్నది.

"నీ మనస్సులో బాధకలిగితే నువ్వయితే ఏం చేస్తావు?"

"ఇష్టమైన వాళ్లుంటే బయట పెట్టుకుం టాను, లేకపోతే లోపల దాచుకుంటాను."

"నాప్రశ్న నీ కర్థంకాలేదు. నీకు బాధకలి గించే మనిషిని గురించి ఏం చేస్తావు?"

"పోట్లాడతాను."

"అట్లాచెప్పు! ఆ మనిషి నాతో నీతో ఎందుకు పోట్లాడదు?"

"విశాలహృదయమేమో!" అన్నది పార్వతి ఆటే నమ్మకం లేకుండా.

"ఖాళీగాఉన్న హృదయాలన్నీ విశాలం గానేఉంటాయేమో?" అని భద్రాచలం ఎదురు సవాలు వేశాడు.

పార్వతికి అతను చెప్పేది నిజమే ననిపిం చింది. తనలాగా అతను తన మొదటి భార్యను గురించి ఊహించవలసిన అవసరము లేదు. అత నామెను చాలాకాలంగా ఎరుగును. ఐదేళ్లు కాపరం చేశాడామెతో.

"నాగరికతగలవాడు చెయ్యగూడని పని చేసి ఇద్దరు పెళ్ళాలను చేసుకొన్నాను. చిత్ర మేమిటంటే ఒకతెకు అసూయపడటము చాత కాదు, రెండోదానికి అసూయపడే అవసరము లేదు!" అన్నా డతను.

"అవసరము ఉంటేమటుకు రెండోది ఏం చేస్తుంది? దానికి అసూయపడే అధికారము లేదు!" అన్నది పార్వతి.

"అసూయపడటానికి అధికారము ఉండా లని నాకు తెలీదే?" అన్నాడు భద్రాచలం నవ్వుతూ.

తరవాత ఇద్దరూ కాస్సేపు మాట్లాడలేదు.

"మనుషులు అట్లా ఎందుకవుతారో?" అన్నది పార్వతి.

"జీవితమంటే భయపడి! కాస్త తెల్ల చొక్కా వేసుకొన్నవాళ్లందరికీ వొంగి దణ్ణాలు పెట్టే వాళ్లు అట్లా ఎందుకవుతారు? భయం! ఆ భయంవెంట ఒక వేదాంతము పుడుతుంది. అది మనుషులను జీవచ్ఛవాలుగా చేస్తుంది. నా మొదటిభార్య మొదటితరం జీవచ్ఛవము కాదు. అంతవరకు రూఢిగా చెప్పగలను. మా మామగారు ఇదే రకం. ఆయనకు వెనుక ఇం కెన్ని తరాలున్నాయో నాకు తెలీదు."

మళ్ళీ ఇద్దరూ ఏదో ఆలోచనలో పడ్డారు. చివరకు పార్వతి బలవంతాన నవ్వుతూ, "నన్ను చూస్తే నాకే సిగ్గేస్తున్నది!" అన్నది.

"ఏం?"

"నేను కాపరానికి వస్తే ఆవిడకు చీమ కుట్టి నట్టన్నా ఉండేట్టు లేదు. ఆవిడ ఉన్న ఇంట్లో

నేను ఉండాలంటే ఏదో భయభయంగా ఉంది.''

''భయపడవలసినమనిషి ఔను!'' అన్నాడు భద్రాచలం.

కొన్ని ఇబ్బందులు ప్రత్యక్షంగా అనుభవించవలసి వస్తే ఉండేదానికన్న ఊహిస్తే ఎక్కువ భయంకరంగా కనిపిస్తాయి. పార్వతికి సోమిదేవమ్మతో సహజీవనం ఇట్లా తోచలేదు. అది ఆమె ఊహించినదానికన్నా చాలా భయంకరముగా పరిణమించింది. పార్వతికి తన సవతిమీద అసూయ అని కాదు. భద్రాచలంచెప్పినట్టు అసూయకు అవకాశమే లేదు. అదే పార్వతికి ఒక పెద్ద పరీక్ష అయింది. సవతులైనందుకు ఇద్దరూ పోట్లాడుకున్నా అది అనాగరికంగా ఉన్నప్పటికీ కనీసం స్వాభావికంగా ఉండును. పోట్లాడటం లేనేలేదు. పైగా సోమిదేవమ్మ తనమీద వొల్లమాలిన సఖ్యము, ఆపేక్ష వొలకబోయసాగింది. నిజమైన ఆపేక్ష ఐతే సంతోషంగా పార్వతి స్వీకరించి ఉండును. సోమిదేవమ్మ ఆపేక్షలో ''చీమూ, నెత్తురూ'' లేవు! అది పరమ కృత్రిమం, అర్థరహితం, ఒక్కొక్కప్పుడు హాస్యాస్పదం. ఒకరకం బుద్ధిహీనుల దృష్టిలో తాను ఎట్లా ప్రవర్తిస్తే, ''ఆహా మనిషికాదు, దేవత'' అనిపించుకొనేటందుకు అవకాశము ఉందో, అట్లా ప్రవర్తించసాగింది సోమిదేవమ్మ. ఎందుకు ప్రవర్తించగలిగిందంటే ఆ మనిషికి హృదయము ఉండవలసినచోట గాలి ఉంది గనక! కనీసం తన ప్రవర్తన ఇతరుల మెప్పు సంపాదిస్తున్నదా అనే విషయములో ఆలోచించేటందుకు కూడా ఆ మనిషికి మెదడు లేదు! లేకపోతే అటువంటి ప్రవర్తన చూసి మెచ్చుకొనేటంత అమాయకులూ, బుద్ధిహీనులూ ఈ ప్రపంచములో ఎవరన్నా ఉంటారా?

ఒక్కొక్కసారి పార్వతికి తన సవతిమీద పట్టరాని ఆగ్రహం వచ్చేది. ''ఈ మనిషితో ఇంకొక్కరోజు గడిపితే నాకు మతి పోతుంది!'' అనుకొనేది. అంత కోపము వచ్చినప్పుడల్లా ఆ వెంటనే జాలీ వచ్చేది. ''ఏమైనా సాటి ఆడది! ఆవిడ స్థానం కాజేశానని ఎంత ఈర్ష్య ఉండొచ్చు? అదేమీ లేకుండా మంచిగా ఉంటున్నది. నేను కృతజ్ఞతగా ఎందుకుండ గూడదు?'' అనుకునేది పార్వతి. ఐతే అంతలోనే సోమిదేవమ్మ అర్థము, సందర్భశుద్ధీలేని ''మంచి'' మాటలేవో అనేది, దానితో పార్వతికి మళ్లీ కంపరం ఎత్తుకొచ్చేది.

దీక్షితులుకు నాలుగో నెల జరుగుతూండగా పార్వతికి గర్భం పోయింది. ఇరుగుపొరుగువాళ్లు పార్వతిని పరామర్శించినదానికంటే సోమిదేవమ్మను ఎక్కువ పరామర్శించవలసి వచ్చింది. ఒక్క ఏడవటం మినహాగా ఆవిడ మిగిలిన హంగామా అంతా చేసింది ''అయ్యో అయ్యో! ఎంత అన్యాయం! బిడ్డ కడుపులో పుట్టినప్పట్నుంచీ అచ్చట్లూ ముచ్చట్లూ ఆలోచిస్తామాయిరి. గర్భం పోవటమంటే బిడ్డ పోవటమేగా! ఆ బాధ అందరికీ అర్థం కాదు లెండి మరి! కన్నకడుపుకు తెలియవలసిందే గాని! ఐదు నెల్లు! ఇంకేముందీ, సహం మోసేసింది. ఇంకొక్క నాలుగునెల్లు ఆగితే పండులాంటి కొడుకును కనేసును! ఏ క్షణాన ఏ మొచ్చేదీ చెప్పలేంగదా! అందులో తొల్చూలు! మరోటీ మరోటీ కాదు!'' ఈ ధోరణిలో సోమిదేవమ్మ వసపోసిన పిట్టలాగా వాగేస్తుంటే పార్వతికి జెర్రులు పాకినట్టయింది. ''నోరు మూస్తావా, ముయ్యవా?'' అని తన సవితి నెత్తిన బరువైన చెంబుతో ఒక్కటి పెడదామనిపించింది.

ఇదంతా జరిగి తొమ్మిదేళ్లు దాటి పదో ఏడు. ఇంతకాలమూ పార్వతికిగాని, సోమిదేవమ్మకుగాని గర్భం లేదు.

''ఇద్దరిదీ ఒకటే జాతకంగా ఉంది. ఐతే మన సోమిదేవికొక నలుసున్నాడు. పాపం, ఆ పిల్లకి అదీ లేదు'' అనేది రావమ్మ.

''ప్రాప్తం ఉండొద్దూ?'' అనేవాడు సీతప్ప.

''అటే వొద్దుగాని, ఇద్దరికీ చెరోమగపిల్లడూ ఉంటే సమంగా ఉండును.''

''ఒకరి జీవానపడి ఒకరు ఏడవకుండా!''

''ఎలాగైనా మన సోమిదేవికున్న అంతస్తు ఆ పిల్లకి రానేరాదూ! దానికితోడు పిల్లలు కూడా లేకపోతే అడిగారూ?''

"నిజమే మరీ! అయినా ఆ పిల్లవాడుకూడా అంత భేదబుద్ధి కలవాడు కాడులే!"

వీళ్ళ సంభాషణలో పిల్ల అంటే ముప్ఫై ఏళ్లు చేరబడుతున్న పార్వతి, పిల్లవాడంటే ముప్ఫైఅయిదు దాటటానికి సిద్ధంగా ఉన్న భద్రాచలం. ఈ సంభాషణలో నిగూఢంగా దాగిఉన్న మూఢవిశ్వాసమేమంటే, తమ మాటల ప్రభావం చేతనైనా "సోమిదేవి" అంతస్తు పార్వతి అంతస్తు కన్న పెరిగితే పెరగవచ్చుననీ, భద్రాచలానికి భార్యలమధ్య భేదబుద్ధి లేదనేసరికి తథాస్తు దేవతలు "తథాస్తు" అనేస్తారనీనూ!

వాస్తవపరిస్థితులు వాళ్లెరగరు. పార్వతి వచ్చాక భద్రాచలం తన మొదటి భార్యను ముట్టుకుని ఎరగడు. ముట్టుకోరాదని పంతమేమీలేదు, పార్వతికి అన్యాయం జరుగుతుందని అంతకన్నా కాదు; అతనికి సోమిదేవమ్మ మీద విముఖత్వం ఆనాటి కానాడు పెరుగుతూ వచ్చింది. తాను ఆమె శరీరాన్ని కామించినప్పుడల్లా ఆమె దృష్టిలో తాను హీనుడైపోయినట్టుగా అతను అనుమానించ సాగాడు. ఆ అనుమానం చాలాసార్లు రుజువు చేసుకున్న మీదట రూఢిచేసుకున్నాడు. ఆడదైతే మాత్రం చేసుకున్న మొగుడి దగ్గిర తనకు గల శరీర వాంఛ ఎందుకు దాచాలో అతనికి బోధపడ లేదు. ఆమెను పరీక్షకు పెట్టాడు. మూడు నెలలు ఆమె జోలికి వెళ్ళలేదు. సోమిదేవమ్మ రాయిలాగా కూచుంది. జాలిపడి తనకు తానై పరీక్ష మానేశాడు. "ఈ పిచ్చి పోయింది గదా అనుకున్నా, మళ్ళీ వచ్చిందే?" అన్నది.

భద్రాచలానికి మొహంమీద ఫెడీమని కొట్టినట్టయింది. కాని పైకి ఏమీ అనలేదు. తరవాత అతనికి అకస్మాత్తుగా అనుమానం కలిగింది— తన భార్యకు శరీరబాధలాటిది లేదేమోనని! "లేకుండా ఎట్లా ఉంటుంది? అసంభవం!" అనుకున్నాడు. కాని కాలం గడుస్తున్న కొద్దీ అటువంటిది సంభవమేనని అతనికి తోచింది. "శవంతో కాపరం చేస్తున్నా!" అన్న నినాదం సృష్టించుకున్నాడు. ఆ సమయంలో పార్వతి అతని జీవితంలో ప్రవేశించింది.

ఇంతా జరిగినా అతను సోమిదేవమ్మకు వెలిగా ఉంచదలుచుకోలేదు. కాని వెలిగా ఉండటానికి ఆమె కెట్టి అభ్యంతరమూ ఉన్నట్టు కనబడలేదు, అతను ఆమెను అలాగే ఉండనిచ్చాడు....

'నువు తొందరపడకు! మరేం ఫరవాలేదు!' అన్నాడు సీతప్ప తత్తరబిత్తరగా.

రావమ్మ గుండెలో రైళ్లు పరిగెత్త సాగాయి.

"అమ్మాయి ఏంరాసిందేమిటండీ?" అన్న దావిడ.

"పార్వతికి కొడుకు వుట్టాట్ట! మొన్న తెల్లారగట్ట మూడూ ఇరవైకి!" అన్నాడు సీతప్ప.

"వుట్టాడుగద! పోనిండి పాపం! ఆ పిల్ల కడుపు చల్లగా! ఈసారి కూడా గర్భంపోతుందేమోనని మహా ఇదైపోయా! చిత్తుగాడితరవాత పదేళ్ళకి! ఈసారి మన అమ్మకడుపున ఒక్క ఆడనలుసు కూడా పుడితే—"

"ఎందుకు పుట్టదూ, నీ వెర్రిగానీ? అగుతుందా ఏమిటే? మాటలేనా?" అన్నాడు సీతప్ప, తాను ఏమంటున్నదీ ఎందుకంటున్నదీ తెలీకుండా.

(ఇంకా ఉంది) ★

---

ఒక రైతుకు ఒకే ఒక విచిత్రమైన ఆశయం ఉండేది. "ముందు ఆలోచించి, తర్వాత ప్రశ్నలడుగు" అనేదే ఆ ఆశయం. ఒకానొక అజ్ఞాతవ్యక్తి ఒకరోజున అతని దగ్గరకు వెళ్ళి "మీదగ్గరుండే జర్సీగేదె ఖరీదెంతండీ" అన్నాడు.

కొంచెం ఆలోచించి "ఒక ప్రశ్న. అయితే మీరు పన్నులు వసూలు చేసేవారా? లేక గేదె రైలుకిందపడి చనిపోయిందా?" అన్నాడు రైతు.